

బెజ్జూర్ : మండల కేంద్రంలో బీఆర్ఎస్ రజతోత్సవ పోస్టర్లను విడుదల చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

మందమర్రి, ఏప్రిల్ 13 : ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించ తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ చెన్నూర్ నియోజక వర్గ నాయకుడు డాక్టర్ రాజారమేశ్ పిలుపు నిచ్చారు. ఆదివారం మందమర్రి పట్టణంలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో నాయకులతో కలసి రజతోత్సవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని, ఎక్కడ సభలు, సమావేశాలు జరిగినా ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తున్నదన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టి.. ప్రజలకు వాస్తవ పరిస్థితిని వివరించే దిశగా సభ సాగుతుందని ఆయన పేర్కొన్నారు. మందమర్రి మున్సిపాలిటీకి 12 బస్సులను కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు మేడిపల్లి సంపత్, రాజశేఖర్, బండారు సూరిబాబు, బడికెల సంపత్, ఎండీ అబ్బాస్, ఈశ్వర్, మద్ది శంకర్, తోట సురేందర్, భట్టు రాజ్‌కుమార్, కళ్ళోజీ అనిల్ కుమార్, పల్లె నర్సింగ్, కనకం రవీందర్, సీపెల్లి సాగర్, ఎండీ ముస్తఫా, బెల్లం అశోక్, మొగురం శ్రీనివాస్, పూసాల ఓదెలు, తోగరి వెంకటేశ్, లింగమూర్తి, సంగర్తి సంతోశ్, మహేశ్, తిరుపతి, రాజనర్సు, మహిళా నాయకులు అమృత రమాదేవి, లక్ష్మి పాల్గొన్నారు.

### బెజ్జూర్‌లో పోస్టర్ ఆవిష్కరణ

బెజ్జూర్, ఏప్రిల్ 13 : మండల కేంద్రంలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్లను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బూస సారయ్య ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఖాజా సమీయుద్దీన్, ఖాజా మోహినుద్దీన్, నాయకులు రాజలింగు, దుర్గం తిరుపతి, బర్ల దేవయ్య, నికాడి మోహన్, కుమ్మరి లక్ష్మణ్, ఆత్రం హరీశ్ పాల్గొన్నారు.



మందమర్రిలో పోస్టర్లను విడుదల చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## మిలటరీ స్కూల్‌కు ఎంపికైన విద్యార్థికి అభినందన

కోటపల్లి, ఏప్రిల్ 13 : రాష్ట్రీయ మిలటరీ స్కూల్‌కు ఎంపికైన కోటపల్లి మండలం రాపనపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి గుర్రం ఆకాశ్‌పటేల్‌ను కలెక్టర్ కుమార్ దీపక్ అభినందించారు. గుర్రం రాణి–సమ్మయ్య దంపతుల కుమారుడైన ఆకాశ్ ఐదో తరగతి పూర్తి చేసి రాష్ట్రీయ మిలటరీ స్కూల్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచాడు. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూర్ రాష్ట్రీయ మిలటరీ స్కూల్‌కు ఎంపికైన ఆకాశ్‌ను, విద్యార్థికి శిక్షణ ఇచ్చిన లతా ఇనిస్టిట్యూట్ ఆఫ్ నవోదయ సైనిక్ స్కూల్ యాజమాన్యాన్ని కలెక్టర్ కుమార్ దీపక్ అభినంది జ్ఞాపిక అందజేశారు.



ఆకాశ్ పటేల్‌ను అభినందిస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



ప్రాణహిత నది నుంచి ఎడ్ల బండిలో నీళ్లు తీసుకొస్తున్న గ్రామస్తుడు



మొర్లిగూడలో చేతిపంపు వద్ద నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

# తలాపునే ప్రాణహిత తప్పని నీటి వ్యథ

**మొర్లిగూడలో అడుగంటిన భూగర్భ జలాలు**

- గుక్కెడు నీటి కోసం చేతి పంపుల వద్ద గంటల తరబడి నిరీక్షణ
- నిర్వహణ లేక అందని మిషన్ భగీరథ జలం
- ఇబ్బందుల్లో గ్రామస్తులు

పెంచికల్‌పేట్, ఏప్రిల్ 13 : తలాపునే ప్రాణహిత నది ఉన్నా.. ఆ ఊరి ప్రజానీకం తాగు నీటికి తల్లడిల్లుతున్నది. మిషన్ భగీరథ నిర్వహణ సరిగా లేక గుక్కెడు నీటికోసం పడరాని పాట్లు పడుతున్నది. చేతిపంపుల వద్ద గంటల తరబడి నిరీక్షించి గొంతు తడుపుకోవాల్సిన దుస్థితి నెలకొన్నది.

### గుక్కెడు నీటి కోసం గంటలతరబడి..

పెంచికల్‌పేట్ మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన మొర్లిగూడలో తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. మిషన్ భగీరథ పథకం పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టక అన్ని వాడలకూ నీరందడం లేదు. ఇక భూగర్భ జలాలు అడుగంటడంతో గ్రామంలో నున్న రెండు చేతి పంపుల నుంచి నీరు సరిగా రావడం లేదు. అరగంట పాటు కొడితే ఒక్క బిందె మాత్రమే నిండుతున్నది. పనులన్నీ వదులుకొని గంటలతరబడి వేచి ఉండి తాగు నీరు తెచ్చుకంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తలాపునే (అర కిలోమీటర్) ప్రాణహిత నది ఉన్నా.. ఫలితం లేకుండా పోతుందని పేర్కొంటున్నారు. ఇంటి అవసరాలకు ప్రాణహిత నదికి కాలినడకన.. ఎండ్ల బండ్లపైన వెళ్లి డ్రమ్ముల్లో నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొన్నది. ఇకనైనా అధికారులు స్పందించి తాగు నీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



నీళ్ల కోసం చేతిపంపు వద్దకు వచ్చిన మహిళలు



### అరగంట కొడితే బిందెడు నీళ్లు

మా కాలనీకి మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. తాగు నీటి కోసం అరిగోస పడుతున్నం. పొద్దున లేచి నీళ్ల కోసం కొట్లాడుడైతంది. ఇంటి పనులన్నీ పక్కనపెట్టి బోరింగ్ వద్ద పడిగాపులు కాస్తున్నం. బిందెడు నీటి కోసం అరగంట కొట్టాల్సి వస్తున్నది. ఇకనైనా సార్లు స్పందించి మాకు తాగు నీరందేలా చూడాలి.

*- కుడిమెత వనిత, మొర్లిగూడ*



### వారానికోసారి కూడా నీళ్లివ్వరు

ట్యాంక్ వరకు మిషన్ భగీరథ నీళ్లొస్తున్నయి. పైపులైన్లు కూడా ఉన్నాయి. కానీ నీరు రావడం లేదు. కనీసం వారంలో ఒక్క రోజు కూడా రావు. బోరింగ్ నీళ్లే దిక్కవుతున్నయి. ఇక బట్టలు ఉతకడం.. ఇంటి అవసరాల కోసం ప్రాణహిత నదికి వెళ్లి తెచ్చుకుంటున్నం. అధికారులు స్పందించి మాకు మిషన్ భగీరథ నీళ్లు వచ్చేలా చూడాలి.

*-గావిడే చంద్రకళ, మొర్లిగూడ*



నీటిమడుగులో మునిగి ఎండనుంచి ఉపశమనం పొందుతున్న పిచ్చుకలు

ఎండకు తలపై గుడ్డలు కప్పుకొని వెళ్తున్న మహిళలు

# భానుడి భగ భగ

**ఎండ, ఉక్కపోతతో అల్లాడుతున్న జనం**

*భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండగా, ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండ తీవ్రంగా ఉంటోంది. ఆదివారం 43.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వేడిగాలులు, ఉక్కపోతతో జనం అల్లాడిపోవాల్సి వచ్చింది. సింగరేణి ప్రాంతాలు, ఓపెన్‌కాస్ట్ గనులు ఉన్న చోట పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. జన సంచారం లేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ముఖ్యమైన పనులున్నవారు ఉదయం, సాయంత్రం వేళల్లో చేసుకోవాల్సి వస్తున్నది. దూర ప్రయాణాలు చేసేవారు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.* *- మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 13*



ఎండవేడికి తట్టుకోలేక మొహం పై నుంచి నీటిని పోసుకుంటున్న యువకుడు



ఎండకు నిర్మానుష్యంగా మారిన మంచిర్యాలలోని బైపాస్‌రోడ్డు

# రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలి

### సింగరేణి డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్లు

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 13 : రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని సింగరేణి డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) కే వెంకటేశ్వర్లు సూచించారు. ఆదివారం శ్రీరాంపూర్ ఏరియాలో పర్యటించారు. జనరల్ మేనేజర్ కార్యాలయంలో జీఎం మునిగంటి శ్రీనివాస్‌తో కలిసి శ్రీరాంపూర్ ఏరియా బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై సమీక్ష నిర్వహించారు. అనంతరం శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ఓసీపీ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌కు సంబంధించిన యంత్రాల పనితీరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఓసీపీలో నిల్వ ఉన్న బొగ్గును వీలైనంతా త్వరగా రవాణా చేయాలన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సర లక్ష్యాలను సాధించడానికి ప్రతి ఉద్యోగి కృషి చేయాలన్నారు. ఓసీపీలకు కావాల్సిన యంత్రాలు, సామగ్రిని సమకూర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రాజెక్ట్ ఇంజినీర్ నాగరాజు, ఓసీపీ మేనేజర్ శ్రీనివాస్, సర్వే అధికారి సంపత్, ఓబీ కాంట్రాక్ట్ కంపెనీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి

జైపూర్, ఏప్రిల్ 13 : ఉత్పత్తి లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని సింగరేణి ప్లానింగ్స్ అండ్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్‌తో కలిసి ఇందారం ఓపెన్‌కాస్టు గనిని సందర్శించారు. ఓపెన్‌కాస్టులో మట్టి తవ్వకాలు చేపడుతున్న వరాహా కంపెనీ సిబ్బందితో మాట్లాడారు. ఇప్పటికే 12 రోజులు వోల్వో డ్రైవర్లు సమ్మె నిర్వహించిన కారణంగా ఉత్పత్తిలో వెనుక ఉన్నట్లు తెలిపారు. వాహనాల సంఖ్యను పెంచి పని గంటలను సైతం పెంచాలని సూచించారు. అనంతరం అధికారులతో ఉత్పత్తికి సంబంధించిన అంశాలపై రివ్యూ నిర్వహించారు. ప్రాజెక్టు అధికారి ఏవీ రెడ్డి, మేనేజర్ రవికుమార్, ప్రాజెక్టు ఇంజినీర్ రామకృష్ణారావు, రక్షణ అధికారి సతీశ్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



సీసీసీ నస్పూర్ : ఓసీపీ పని స్థలాలను పరిశీలిస్తున్న సింగరేణి డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్లు


